క్లుప్తంగా

లోకేశ్వరి కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలి

తిరుపతి అర్బన్: శిల్పారామంలో క్రాస్ వీల్ ఘటనలో మృతి చెందిన లోకేశ్వరి కుటుంబానికి రూ. 10లక్షలు ఆర్థికసాయం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బాధితురాలి కుటుంబాన్ని ఆదుకునే విషయమై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకుపోతామని స్పష్టం చేశారు. సోమవారం(ఈ నెల 4వ తేదీ) గేమ్ జోన్ క్రాస్ వీల్ విరిగిపోయి ప్రాణాలు కోల్పోయిన లోకేశ్వరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉందని వెల్లడించారు. జాయింట్ వీల్ పైకి వెళ్లినప్పుడు 20 అడుగుల పైకి వెళ్లాక కమ్మీ విరిగిపోవడంతో కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడిన లోకేశ్వరిని ఆస్పత్రికి తరలిస్తున్న నేపథ్యంలో మార్గమధ్యలో మృతి చెందారని వివరించారు. ఆ కుటుంబాన్ని తప్పకుండా ఆదుకోవాల్సి ఉందన్నారు. లేదంటే న్యాయం కోసం పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


సినీనటి అనన్య

తిరుమల: తమిళనాడు ఎంపీ అన్బుమణి రామదాసు, సినీనటి అనన్య తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

పంటల బీమాపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ మనోహర్‌బాబు

భాకరాపేట : పంట బీమాపై రైతులు అవగాహన కలిగి ఉండాలని తిరుపతి ఏడీఏ మనోహర్‌బాబు అన్నారు. మంగళవారం ఎర్రావారిపాళెం మండలంలోని ఎర్రావారిపాళెం, చెరుకువారిపల్లె పంచాయతీల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు, పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం గురించి వివరించారు. వరికి ఇన్సూరెన్స్ కోసం రూ.435 ప్రీమియం చెల్లించాలని, అందుకు డిసెంబర్ 31 చివరి తేదీ అన్నారు. అలాగే వేరుశనగకు రూ.290 ప్రీమియం చెల్లించాలని, అందుకు డిసెంబర్ 15 చివరి తేదీ అన్నారు. కార్యక్రమంలో ఏఓ ఖాదర్‌బాషా, పశు వైద్యాధికారి, ఉద్యానవనశాఖ అధికారి, రైతు సేవాకేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.


హౌస్ వైరింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈనెల 11వ తేదీ (సోమవారం) నుంచి 30 రోజుల పాటు పురుషులకు హౌస్ వైరింగ్‌పై పూర్తి ఉచితంగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.సురేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19–45 ఏళ్ల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ పురుషులు అర్హులన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదివి ఉండాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు కూడా ఇస్తామని తెలిపారు. ఆశావహులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకు వచ్చి వారి పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి, 79896 80587, 94949 51289 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్టుమెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 74,651 మంది స్వామివారిని దర్శించుకోగా 24,712 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.14 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయానికంటే ముందే వెళ్లే భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

టీటీడీ సహకార బ్యాంక్ చైర్మన్‌కు అభినందనలు


కిషోర్‌కుమార్‌ను అభినందిస్తున్న కార్పొరేటర్లు

తిరుపతి కల్చరల్: టీటీడీ ఉద్యోగుల సహకార బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నికైన ఆర్.కిషోర్‌కుమార్‌కు కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, టౌన్‌బ్యాంక్ మాజీ డైరెక్టర్లు మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. ఆయనను కలిసిన వారిలో టీజీ వెంకటకృష్ణ, ఎస్‌కే బాబు, వెంకటేష్‌రెడ్డి, మునికృష్ణ, తోట వెంకటేశ్వర్లు, దొడ్డారెడ్డి శ్రీనివాసులురెడ్డి, శేఖర్ బాబు, పోలీసుబాబు, టీజీ దేవదాస్, చిరంజీవి, తులసి తదితరులు ఉన్నారు.

వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా..

- అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో ఔత్సాహికులకు శిక్షణ
- రాష్ట్రవ్యాప్తంగా హాజరైన 23 మంది యువ ఇన్నోవేటర్లు
- ఆర్‌ఏఆర్‌ఎస్ వేదికగా నెలరోజుల పాటు శిక్షణా కార్యక్రమం
- ప్రతిభ చూపితే యోచ్, అగ్రిఇన్‌వో పథకాలకు ఎంపిక
- వినూత్న ఆలోచనలతో ముందుకు వచ్చే విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం


జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వెటర్నరీ వర్సిటీ వీసీ, ఏడీఆర్ సుమతి, అధికారులు

తిరుపతి సిటీ: వ్యవసాయ రంగం అభివృద్ధి పథంలో నడవాలంటే ఆంగ్రూ సంస్థల పాత్ర కీలకమని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ జేవీ రమణ అన్నారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నెలకొల్పిన ఆంగ్రూ పోషన్ ఇంక్యుబేటర్‌కు ఎంపికైన 8వ బ్యాచ్ ఔత్సాహిక యువ ఇన్నోవేటర్లకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, వెటర్నరీ రంగాలను అనుసంధానిస్తూ కొత్త ఆలోచనలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ల్యాబ్ టు ల్యాండ్, ల్యాండ్ టు మార్కెట్ వరకు ఇన్నోవేటివ్ ఐడియాస్‌లో ఎంతో మార్పు వచ్చిందన్నారు. యువ ఔత్సాహిక ఇన్నోవేటర్లు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం యాచ్, అగ్రి ఇన్వో, విద్యార్థులకు సంబంధించిన మెరిస్టమ్స్ ప్రోగ్రాంకు సంబంధించిన పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల అసోసియేట్ డీన్ ఎంవీ రమణ, డాక్టర విశ్వనాథ్, పెద్దసంఖ్యలో ఇన్నోవేటర్లు పాల్గొన్నారు.

ఎక్కువ పంటలు సాగు చేసేలా..



చిన్న, సన్నకారు రైతులు, పొలం తక్కువ ఉన్న రైతులు తమకు అందుబాటులో ఉన్న దాంట్లోనే ఎక్కువ పంటలను సాగు చేసి అధిక దిగుబడి పొందే విధంగా ఏరో ఫోనిక్స్ విధానాన్ని అభివృద్ధి చేస్తున్నాను. అగ్రి బిజినెస్ సెంటర్ ఆధ్వర్యంలో శిక్షణ పొంది నా ఇన్నోవేషన్‌ను మరింత అభివృద్ధి చేసుకుని ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేస్తా. – గాయత్రి, మిట్టూరు, రామచంద్రాపురం, చంద్రగిరి

రూ.6.5 కోట్లతో ప్రోత్సహించాం



తిరుపతి ఆర్‌ఏఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ నుంచి ఎంతోమంది యువత, ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చాం. పలు పథకాల ద్వారా సుమారు రూ.6.5 కోట్లు నగదు ప్రోత్సాహకాలు అందించి అంకుర సంస్థల ఏర్పాటుకు సహకారం అందించాం. ఇక్కడ శిక్షణ పొందిన వారు పారిశ్రామికవేత్తలుగా రాణిస్తూ పలువురికి ఉపాధి కల్పించడం సంతోషకరం. – డాక్టర్ వి.సుమతి, ఏడీఆర్, ఆర్‌ఏఆర్‌ఎస్, తిరుపతి

శిక్షణ ఉపయోగపడుతుంది..



మల్బరీ మెడిసినల్ అప్లికేషన్ పేరుతో ట్యాబ్లెట్ల పైభాగంలో ఉపయోగించే కోటింగ్ మెడిసిన్‌ను అభివృద్ధి చేస్తున్నా. ఇందులో ప్రధానంగా మల్బరీ ఆకులలో లభించే 'మ్యూసిలేజ్' అనే పదార్థాన్ని ఉపయోగించి నిత్యం ప్రజలు వినియోగించే మందుబిల్లలపై వేసే కోటింగ్‌ను డెవలప్ చేస్తున్నాను. అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ ద్వారా ఇచ్చే శిక్షణ నాకు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నా. – కే.శ్వేత కుమారి, యువ ఇన్నోవేటర్, తిరుపతి

విద్యార్థుల కోసం నూతన స్కీమ్



అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ సెంటర్‌కు ఎంపికై ఔత్సాహికులకు నెల రోజుల పాటు వారి ఆవిష్కరణలపై ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ప్రతిభను ఆధారంగా తీసుకుని మరో లెవల్‌కు పంపుతాం. అక్కడ ప్రతిభ చూపిన వారికి యోచ్ ప్రోగ్రాం కింద రూ.5 లక్షలు, అగ్రి ఇన్వో పథకం కింద రూ.25 లక్షలు అంకుర సంస్థల ఏర్పాటు కోసం నగదు గ్రాంట్‌గా అందిస్తారు. – డాక్టర్ కదిరి మోహన్, ఇంక్యుబేటర్ ఇన్‌చార్జ్, ఆర్‌ఏఆర్‌ఎస్, తిరుపతి

డ్రోన్ వినియోగంపై ప్రత్యేక యాప్..



వ్యవసాయదారులకు క్రిమిసంహారక మందులను పిచికారీ చేయడంలో ప్రస్తుతం డ్రోన్ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతోంది. రైతులు ఒకేసారి పంటలకు డ్రోన్ల ద్వారా పిచికారీ చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. కానీ సకాలంలో డ్రోన్లు అందుబాటులో లేకుండా చాలా ఇబ్బందులకు గురవుతుంటారు. అందుకోసం ప్రత్యేక యాప్ డెవలప్ చేస్తున్నా. – ఎస్.గీతాలక్ష్మి, అత్తిలి, పశ్చిమ గోదావరి జిల్లా

బాధితులకు అండగా నిలవడమే తప్పా..?

- ఎర్రావారిపాలెం జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్: తమ సొంత గ్రామంలో మైనర్ బాలికపై జరిగిన దాడి ఘటనలో తాను ఎక్కడా రాజకీయ కోణంలో మాట్లాడలేదని, తాను మాట్లాడినట్లు నిరూపిస్తే ఎలాంటి ప్రమాణానికైనా సిద్ధమని ఎర్రావారిపాలెం జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తిరుపతిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మైనర్ బాలికపై జరిగిన దాడిని తాను రాజకీయం చేస్తున్నట్లు పులివర్తి సుధారెడ్డి చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. తమ సొంత గ్రామం యలమంద గ్రామానికి చెందిన పదో తరగతి బాలిక స్కూల్ నుంచి ఇంటికి వస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు అడ్డగించడమే కాకుండా దాడి చేసి గాయపరిచారని తెలిపారు. స్పృహ తప్పి పడి ఉన్న తన బిడ్డను రక్షించాలని బాలిక తండ్రి ఇబ్బందిని చూసి గ్రామస్తులంతా అండగా ఉండమన్నారని, స్థానిక ప్రజాప్రతినిధిగా బాధితురాలికి తక్షణ వైద్య సౌకర్యం కల్పించేందుకు ప్రయత్నించామన్నారు. అయితే తాము బాధితురాలికి అండగా నిలవడమే పాపమైనట్లు సుధారెడ్డి తనపై ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. స్థానిక జెడ్పీటీసీగా ఆస్పత్రిలో ఉన్న బాలికను తిరుపతి ఎంపీ గురుమూర్తితో కలిసి పరామర్శించేందుకు వెళ్తే డీఎస్పీ వెంకటనారాయణ లోపలకు వెళ్లకుండా అడ్డుకుని దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. అందుకే ఎంపీతో పాటు మరికొందరితో కలిసి తాము బాధిత బాలిక కుటుంబానికి న్యాయం జరగాలని నినదించామన్నారు. అయితే ఈ ఘటనపై రాజకీయ కోణంలో ఎవరితోనూ మాట్లాడలేదని, స్వార్థ రాజకీయాల కోసం మహిళలను బయటకు లాగవద్దని, అది ఎవరికీ మంచిది కాదని హితవు పలికారు. సమావేశంలో యలమంద సర్పంచ్ నాగలేశు, పరంధామయ్య పాల్గొన్నారు.

శిల్పారామంలో తనిఖీలు


ఘటనపై విచారిస్తున్న సీఈఓ స్వామి నాయుడు ఇతర అధికారులు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో మహిళ మృతి చెందగా, మరో మహిళ తీవ్ర గాయాలపాలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం శిల్పారామం సీఈఓ స్వామి నాయుడు, ఇంజినీరింగ్ అధికారులతో కలసి తనిఖీలు చేపట్టారు. ప్రమాదం జరిగిన ప్రదేశం గురించి ఆరా తీశారు. ఇకపై ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తక్షణమే జాయింట్ వీల్, ప్రమాదం జరిగిన క్రాస్ వీల్, లిఫ్ట్ అనుమతులు రద్దు చేయాలన్నారు. ఇక మీదట కేవలం పిల్లలు ఆడుకోవడానికి ప్రమాద అవకాశాలు లేని వాటిని మాత్రమే అనుమతించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని శిల్పారామాల్లో కూడా ఇవే నిబంధనలు వర్తింపజేస్తున్నటు తెలిపారు. పరిపాలన అధికారి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వన్యప్రాణులు రాకుండా చర్యలు


ఉపాధ్యాయనగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్, అటవీశాఖ అధికారులు

తిరుపతి తుడా/ తిరుపతి మంగళం: వన్యప్రాణులు జనావాసాల్లోకి రాకుండా చర్యలు చేపడతామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. కరకంబాడి మార్గంలోని బయోట్రిమ్, ఫారెస్ట్ నుంచి వన్యప్రాణులు ఉపాధ్యాయ నగర్‌లోకి వస్తున్నాయని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పలువురు నగర కమిషనర్‌కు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం స్టేట్ సిల్వికల్చరిస్ట్ నరేంద్రన్‌తో కలసి ఆమె బయోట్రిమ్, ఉపాధ్యాయనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయని అందిన ఫిర్యాదులపై తగు చర్యలు చేపడదామన్నారు. ఉపాధ్యాయ నగర్ వైపు ప్రహరీ గోడ నిర్మించేలా పరిశీలన చేస్తున్నామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. అలాగే బయోట్రిమ్‌లో నివాసం ఉంటున్న వారి వద్ద ఉత్పన్నమయ్యే చెత్తను తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ డ్రైనేజీ కాలువలో చెత్త, నివాసాల్లో ఉత్పన్నమయ్యే చెత్తను తరలించేందుకు ఫారెస్ట్ అధికారులతో చర్చించి ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఆమె వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, అసిస్టెంట్ సిల్వికల్చరిస్ట్ పవన్ కుమార్, అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సోమశేఖర్, తదితరులు ఉన్నారు.

మురుగునీరు సజావుగా వెళ్లేలా చర్యలు

తిరుపతి సిటీ: నగరంలో ఉత్పన్నమయ్యే మురుగు నీటిని డ్రైనేజీ కాలువల ద్వారా సాఫీగా వెళ్లేలా అన్ని చర్యలు చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. మంగళవారం 14వ డివిజన్‌లోని ఎమ్మార్‌పల్లి, మజ్జిగ కాలువ, బైరాగిపట్టెడ, కేశవాయనగుంట ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణతో కలసి ఆమె కాలువలను పరిశీలించారు. అలాగే 15వ ఫైనాన్స్ నిధులతో న్యూబాలాజీ కాలనీ, చింతలచేను, అన్నమయ్య మార్గ్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు.

కాలువపై నిర్మాణాలు ఎలా చేపడతారు?

- కాలువ పోరంబోకు స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవు
- కన్వర్షన్ చేయకుండా ఇల్లు ఎలా నిర్మిస్తారు ?
- పంటకాలువ ఆక్రమణలపై సర్వే చేసిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు


శెట్టిపల్లి న్యూమంగళం పంచాయతీ పరిధిలో పంట కాలువను సర్వే చేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

తిరుపతి మంగళం : తిరుపతి శివారు ప్రాంతాల్లో ఉన్న పంట పొలాల్లో ఇప్పటికే అపార్టుమెంట్లు, పెద్ద పెద్ద భవనాలు వెలుస్తున్నాయి. మిగిలిన కొద్దిపాటి పొలాలకు, చెరువులకు పంటకాలువల ద్వారా నీరు వెళ్తోంది. అయితే వాటిని కూడా కొంతమంది ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ మేరకు తిరుపతి అర్బన్ మండలం న్యూ మంగళం పంచాయతీ పరిధిలోని అన్న చెరువు, శెట్టిపల్లి చెరువులను, పంటపొలాలను కలుపుతూ ప్రవహిస్తున్న కాలువను రెవెన్యూ, జలవనరులశాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ అనుమతులు లేకుండా పంటకాలువలపై నిర్మాణాలు ఎలా చేపడుతారని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానీబాషా, జలవనరుల శాఖ అధికారి కవిత ప్రశ్నించారు. కాలువపై అనుమతులు లేకుండా నిర్మించిన మట్టి నిర్మాణాలను తొలగించి నీటి ప్రవాహానికి అంతరాయం కలగకుండా చేస్తామని చెప్పారు. చెరువులను కలుపుతూ ప్రవహించే కాలువలను మూసివేయడం, కాలువలపై నిర్మాణాలను చేపట్టడం ద్వారా చెరువులకు నీటి సరఫరా ఆగిపోతుందన్నారు. అలాగే కాలువ పోరంబోకు స్థలంలో ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే శెట్టిపల్లి న్యూ మంగళం పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమ లేఅవు ట్లు వేసి ఇంటి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఆర్‌ఐ జానీబాషా హెచ్చరించారు. అనంతరం సరిహద్దులను సర్వే చేసి కాలువ పరిధిని నిర్ణయించారు. కార్యక్రమంలో సర్వేయర్ జగదీష్, వీఆర్‌వో సతీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం హోమం ఘనంగా ప్రారంభమైంది. శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో నెల రోజుల పాటు చేపడుతున్న హోమ మహోత్సవాల్లో భాగంగా శ్రీసుబ్రమణ్యస్వామి వారి హోమం శాస్త్రోక్తంగా చేపట్టారు. చివరి రోజు 7వ తేదీ సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలక్రిష్ణ, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారుల హర్షాతిరేకం

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర క్రీడా సమీక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను 3 శా తానికి పెంచారు. అలాగే ఒలింపిక్స్‌లో బంగారు పతకం సా ధించిన వారికి రూ.7 కోట్లు ప్రోత్సాహక బహుమతి, శాప్‌లో గ్రేడ్–3 కోచ్‌లకు అంతర్ జాతీయ మెడల్ సాధించిన వారికి 50 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం తిరుపతిలో వివిధ క్రీడా సంఘాల ఆధ్వర్యంలో క్రీడాకారులు సంబరాలు జరుపుకున్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు, డీఎస్‌డీఓ సయ్యద్‌సాహెబ్, కోచ్‌లు, పీడీలు, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు హాజరయ్యారు.

ఎమ్మెల్యే ఆరణి అవినీతిపై విచారణ చేపట్టాలి


మాట్లాడుతున్న టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుదేవ్ యాదవ్

తిరుపతి కల్చరల్: తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అవినీతి ఆర్జనపై విచారణ చేయించాలని తిరుపతి టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుదేవయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో నూతన మద్యం పాలసీ ద్వారా కేటాయించిన మద్యం దుకాణాలలో చిత్తూరుకు సంబంధించిన తన అనుచరవర్గాన్ని దింపి ఆయనే నేరుగా షాపులను నడపడం విడ్డూరంగా ఉందన్నారు. తిరుపతిలో ఉన్న ప్రభుత్వ విభాగాల్లో దందాలను మొదలు పెట్టారన్నారు. మున్సిపాలిటీలో ప్రతి కాంట్రాక్టర్ 15 శాతం కప్పం కట్టాలని హుకుం జారీ చేశారని తెలిపారు. ఇప్పటి వరకు రూ.100 కోట్లపై అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల మార్గాలను నిర్మించే సమయంలో తమ స్థలాలను పోగొట్టుకున్న వారికి అందించే టీడీఆర్ బాండ్ల విషయంలోనూ పర్సంటేజీలు ఇవ్వాలని భూ బాధితులకు అల్టిమేటం జారీ చేస్తున్నారన్నారు. తిమ్మినాయుడుపాళెం మార్గంలో భూమిని కోల్పోయిన వారిని ఇలానే బెదిరించారని ఆరోపించారు. సమావేశంలో టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు అమరనాథ్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మాధంచంద్ర, చింతారమేష్, హరికృష్ణయాదవ్ పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్ట్

చంద్రగిరి: బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఘటన మంగళవారం చంద్రగిరిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జవహర్‌బాబు ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం చంద్రగిరిలో దాడులు చేపట్టారు. ఈ క్రమంలో పాతపటలోని కోట గ్రామానికి వెళ్లే దారిలో అక్రమంగా బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు తెలుసుకుని దాడి చేసి సుబ్రమణ్యం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి నిందితున్ని రిమాండుకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమంగా విక్రయిస్తున్న మద్యానికి సంబంధించిన సమాచారాన్ని 91825 41299, 86881 22134 నంబర్లకు తెలుపాలని సూచించారు.

పంట పొలాలపై ఏనుగుల హల్‌చల్


మామిడి కొమ్మలను విరిచేసిన ఏనుగులు

పాకాల: మండలంలోని చంద్రగిరివారిపల్లి, ఎస్టీ కాలనీ, వరదప్పనాయుడుపేట, వల్లివేడు, ఈ–పాలగుట్టపల్లి పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు సోమవారం రాత్రి పంట పొలాలను ధ్వంసం చేశాయి. రైతులు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, ప్రత్యూష్‌రెడ్డి, మునిరత్నం, రవి పంట పొలాలను నాశనం చేశాయి. మంగళవారం స్థానిక రైతులు పరిశీలించి కన్నీరుమున్నీరుగా విలపించారు. మామిడి తోటలు, పనస చెట్లు, కొబ్బరి మొక్కలు, బావుల వద్ద వేసిన పైపు లైన్లను నాశనం చేశాయని వాపోయారు. అటవీ అధికారులు స్పందించి ఏనుగుల నుంచి పంటలను రక్షించాలని కోరారు.

కాలినడకన తిరుమలకు చేరుకున్న సాయిదుర్గతేజ్


తిరుమలకు నడచి వెళ్తున్న సాయిదుర్గతేజ్

తిరుమల : శ్రీవారి దర్శనార్థం ప్రముఖ సినీహీరో సాయిదుర్గతేజ్ మంగళవారం కాలినడకన తిరుమలకు చేరుకున్నాడు. అలిపిరి నుంచి కాలినడకన బయలుదేరిన ఆయన మంగళవారం అర్ధరాత్రికి కొండకు చేరుకున్నాడు. స్థానిక అతిథిగృహం వద్ద ఆయనకు అభిమానులు స్వాగతం పలికారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో ఆయన శ్రీవారి మూలమూర్తిని దర్శించుకోనున్నారు.

అమ్మవారి సేవలో టీటీడీ చైర్మన్


అమ్మవారి ఆలయం వెలుపల టీటీడీ నూతన చైర్మన్ బీఆర్ నాయుడు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని టీటీడీ నూతన చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

టీటీడీ చైర్మన్‌కు స్వాగతం

తిరుపతి(అలిపిరి): టీటీడీ పాలక మండలి చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడును మంగళవారం రేణిగుంట ఎయిర్‌పోర్టులో ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే టీటీడీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయనున్న ఆనంద్‌సాయికి స్వాగతం పలికారు. టీటీడీ ఎంప్లాయీస్ అసోసియేషన్ కోశాధికారి గుంటూరు రేఖ, వర్కింగ్ ప్రెసిడెంట్ వంకీపురం పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి


ఇస్కాన్ వద్ద నాగదేవతకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తిరుపతి కల్చరల్: దీపావళి నాడు కేదారీ నోముల పూజలు చేసిన భక్తులు ఐదో రోజు నాగుల చవితి నాడు నాగదేవతకు పూజలు చేస్తారు. అందులో భాగంగా మంగళవారం ఆధ్యాత్మిక తిరుపతి నగరంలోని మంచినీళ్లగుంట వద్ద ఉన్న నాగదేవత ఆలయం, దేవేంద్ర థియేటర్ సమీపంలో ఉన్న శివాలయం, కపిలతీర్థ ఆలయ ప్రాంగణం, ఇస్కాన్ మందిరం రోడ్డు, అలిపిరి సమీపంలో ఉన్న పుట్టల వద్ద భక్తులు నాగుల చవితి పూజలు చేశారు. నాగదేవతకు పాలు పోసి, భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి


నాగాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

చంద్రగిరి: మండలవ్యాప్తంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో నాగుల చవితి జరుపుకున్నారు. మంగళవారం చంద్రగిరి జాతీయ రహదారి సమీపంలో వెలసిన నాగాలమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

